ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 23 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	156	170
సూర్యాపేట	రూ.90	130	160
నల్లగొండ	రూ.100	150	170

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 ׀ కనిష్ఠం 20.0



విద్యుత్ దీపాల వెలుగులో యాదగిరిగుట్ట ఆలయం

ప్రారంభానికి సిద్ధమైన దివ్య విమాన గోపురం

హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నేడు స్వర్ణ విమానగోపుర మహాకుంభాభిషేకం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో దివ్య స్వర్ణ విమాన గోపురం ప్రతిష్ఠామహోత్సవానికి సర్వం సన్నద్ధమైంది. వేదపండితులు నిర్ణయించిన మేరకు ఆదివారం ఉదయం 11.54గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కారంశ సముహూర్తాన శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ స్వామివారికి గోపురాన్ని అంకితం చేయనున్నారు. మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. స్వామి సన్నిధిలో స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు నాలుగో రోజుకు చేరాయి. ఇదిలా ఉండగా, శనివారం యాగశాలలో హోమాలు, జపాలు, పారాయణాలు వైభవంగా కొనసాగాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి, భువనగిరి అర్బన్)

•7లో..

ఇంకుడు గుంతల నిర్మాణాలేవీ?



- ప్రజలకు కొరవడిన అవగాహన
- పట్టించుకోని అధికారులు

వర్షాభావానికి తోడు వేసవి ఎండల కారణంగా ఏటా భూగర్భజలాలు పడిపోతున్నాయి. ఫలితంగా వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. పట్టణాల్లో మిషన్ భగీరథ, మునిసిపల్ బోర్లు, బావులతో నల్లాల ద్వారా నీటిని అందిస్తున్నా ప్రజలకు సరిపోవడంలేదు. ఫలితంగా ఇంటికో బోరు ఏర్పాటుచేసుకుంటున్నారు. ఈ బోర్లు సైతం వేసవిలో ఒట్టిపోతున్నాయి. దీంతో వేసవిలో ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు. పట్టణాల్లో ఇల్లు నిర్మించేప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోరు నీటి రీచార్జ్‌కు ఉపయోగపడే ఇంకుడు గుంత నిర్మాణాన్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీనిపై అవగాహన కల్పించేవారు సైతం కరువయ్యారు.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు

•6లో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జీవనరేఖగా నిలవాల్సిన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులకు తరచూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సాంకేతిక సమస్యలు, పునరావాస ఇబ్బందులు, అటవీశాఖ అనుమతులు రాని కారణంతో 2012కే పూర్తవ్వాల్సిన ప్రాజెక్టు ఇప్పటికీ నత్తనడకన సాగుతోంది. 2007లో మొదలైన ఈ సొరంగమార్గం పనులకు తరచూ ఆటంకాలు కలుగుతుండడంతో ఇప్పటివరకు పథకం పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టులో భాగంగా శ్రీశైలం రిజర్వాయర్ సమీపంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట ప్రాంతం నుంచి నల్లగొండ జిల్లాలోని చందంపేట మండలంలోని నక్కలగండి ప్రాంతం వరకు 43.930కిలోమీటర్లు సొరంగం (టన్నెల్) తవ్వాల్సి ఉంది. అందుకోసం శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్ 19.500 కిలోమీటర్లకు ఇప్పటివరకు 13.935 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 6.015 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఎస్ఎల్‌బీసీ పనులపై నీలినీడలు



సంఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీ

- 2019 నుంచి ఇటీవలి వరకు నిలిచిన పనులు
- తాజాగా, పనులు ప్రారంభించిన వారంలోనే దుర్ఘటన
- ఈ ఘటనతో పనులు ముందుకు సాగడంపై సందిగ్ధం!

ఇన్‌లెట్ వైపు (శ్రీశైలం రిజర్వాయర్ సమీపం నుంచి) తవ్వే సొరంగం పనులు ముందుకుసాగకుండా 2019 నుంచి ఊట నీరు వచ్చిచేరుతోంది. దీంతోపాటు, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో పనులు ముందుకు సాగలేదు. ఊట నీటిని తోడివేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊట మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయించారు. తాజాగా, ఐదు రోజుల క్రితమే ఈ పనులను మళ్లీ పునరుద్ధరించగా, శనివారం పనులు జరుగుతున్న టన్నెల్ వద్ద సుమారు పందమీటర్లకు పైగా కూలిపోవడంతో పెనుప్రమాదం చోటుచేసుకుంది. ఈ టన్నెల్ పెండింగ్ పనులకు సంబంధించి 14వ కిలోమీటర్ నుంచి 19.500 కిలోమీటర్ వరకు ఉన్న ప్రాంతంలో ఊట నీటిని అదుపుచేయలేకపోవడంతో పాటు, శ్రీశైలం రిజర్వాయర్‌లో నీరు టన్నెల్ కాంటూరు లెవల్స్ కంటే ఎగువన ఉండడంతో పాటు ఇక్కడ గ్రానైట్, రాతిశిలల కంటే మట్టి, సన్నరాళ్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో సొరంగం తవ్వగానే పెకుసుబారి కూలిపోతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతూ వస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రౌంటింగ్ చేస్తున్నప్పటికీ అది కప్పును బలంగా ఉంచలేకపోయిందని అందువల్లే శనివారం దుర్ఘటన జరిగి ఉంటుందని అంచనావేస్తున్నారు. 2019 నుంచి ఈ సమస్య తీవ్రతరం కావడంతో ఇన్‌లెట్ సొరంగం పనులు ముందుకుసాగని పరిస్థితి ఏర్పడింది.

మార్చి నుంచి ఔట్‌లెట్ వైపు పనులు చేపట్టే యోచన

మన్నేవారిపల్లి నుంచి (నీరు విడుదలయ్యే వైపునుంచి) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980 కిలోమీటర్లకు 20.435 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 3.545 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. పూర్తి విదేశీసాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా ఈ పనులు చేపట్టారు. టన్నెల్ తవ్వుతున్న టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)లో మరమ్మతులు వస్తే పరికరాలు, బేరింగుల కోసం సంవత్సరాల తరబడి వేచిచూస్తుండడంతో పనులకు తీవ్రస్థాయిలో ఆటంకం కలుగుతోంది. టీబీఎంలో కీలకమైన బేరింగ్ ఇప్పటికే మూడోసారి మరమ్మతు కారణంగా పనులు నిలిచాయి. ఏడుమీటర్ల వ్యాసంతో, 37 మెట్రిక్ టన్నుల బరువుండే ఈ బేరింగ్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉండగా, ఆరునెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ బేరింగ్ తయారీ కంపెనీ రాబిన్‌సన్ కంపెనీతో చర్చించి, అగ్రిమెంట్ చేయించే నిమిత్తం స్వయంగా అమెరికా వెళ్లారు. ఆ కంపెనీకి వెళ్లి బేరింగ్‌కు, ఇతర పరికరాలకు ఆర్డర్ కోసం అగ్రిమెంట్ చేయించారు. ఈ బేరింగ్...

- మిగతా 7వ పేజీలో...

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): శ్రీశైలం సొరంగమార్గం ఇన్‌లెట్ టన్నెల్ నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ప్రమాద ఘటన విషయం తెలియగానే నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డితోపాటు నీటిపారుదలశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జరిగిన ఘటనను పరిశీలించి సహాయక చర్యల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, ఈ ఘటనపై దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ విచారం వ్యక్తం చేశారు. ఘటనపై నీటిపారుదలశాఖ అధికారులను ఆరాతీశారు.



ఘటనా స్థలిలో పరిస్థితిని సమీక్షిస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఫిర్యాదులపై సత్వరమే విచారణ



'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

ఎస్పీ శరత్‌చంద్రపవార్

డిండి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై సత్వరమే విచారణ నిర్వహించి చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి 100 కిలోమీటర్ల దూరంలో డిండి మండలం ఉండడంతో జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజలు వారి సమస్యలను వివరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకే తానే ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'మీట్ యువర్' ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. వచ్చిన 22 దరఖాస్తులపై విచారణ నిర్వహించి చట్ట ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విచారణ చేసి వారం రోజుల్లో నివేదిక అందించాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించినట్లు తెలిపారు. ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పేవారి మాటలు నమ్మవద్దని అన్నారు. అటువంటివారిపై ఫిర్యాదులు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ మోసాలపై టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదుచేయాలన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ మౌనిక, సీఐ సురేష్, ఎస్ఐ రాజు ఉన్నారు.

హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు ప్రారంభం

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పీ.కే.మల్లేపల్లి గ్రామంలోని హజరత్ అబ్బాస్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన మమ్మద్ చాంద్‌పాష ఆధ్వర్యంలో ఒంటెపై గంధం (సందల్)ను సమర్పించారు. ఈ ఉత్సవాలకు నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, సాగర్, ఏపీ రాష్ట్రం మాచర్ల, గుంటూరు, పిడుగురాళ్ల, దాచేపల్లి, చీరాల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లోని ప్రజలు దర్గా వద్దకు చేరుకొని మొక్కు తీర్చుకున్నారు. ఉర్సుకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉర్సులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్ పాల్గొని దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు, ముస్లింలు అనే తేడా లేకుండా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మతసామస్యానికి ప్రతీకగా హజరత్ అబ్బాస్ దర్గా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ కేవీ.రమేష్‌రాజు, వైస్ చైర్మన్ ఎండి.జానీమియా, కార్యదర్శి తాళ్ల కృష్ణ, జెల్ల అబ్బయ్య, సీహెచ్.కృష్ణ, ఎండి.యూసుఫ్‌పాష, రామదాసు, ఎండి.సయ్యద్‌పాషా, జైపాల్‌నాయక్, గనమోని అశోక్ పాల్గొన్నారు.



పీకే.మల్లేపల్లిలో ఒంటెపై గంధాన్ని తీసుకువస్తున్న ప్రజలు

నేలపట్లలో బర్డ్‌ఫ్లూ కలకలం

- రాష్ట్రంలో మొదటి కేసు నమోదు
- సమీప గ్రామంలో ఐదు వేల కోళ్లు మృతి
- భయంతో ప్రాణం ఉన్న 9వేల కోళ్లను పూడ్చివేసిన రైతు



వివరాలు ప్రధాన సంచికలో..

మహా కుంభమేళాకు వెళ్లి వస్తుండగా

రోడ్డు ప్రమాదం

11 మందికి తీవ్ర గాయాలు ● నిజామాబాద్ జిల్లాలో ఘటన •7లో..

మూడోసారి సాగర్

అడవిలో మంటలు

● దగ్ధమైన గడ్డి

●6లో..

జాతీయ రహదారిపై

కారు దగ్ధం

●6లో..

వేర్వేరు కారణాలతో

ముగ్గురి బలవన్మరణం

బాలికల సంరక్షణకు కృషి



చింతపల్లిలో కేజీబీవీలో విద్యార్థులకు శానిటరీ, న్యాప్కిన్స్ అందిస్తున్న కృష్ణవేణి

జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' అనే కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన బాలికలు నెలసరి క్రమంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, సీడీపీవో సక్కుబాయి, ఎంపీడీవో సుజాత, మండల ఆరోగ్య వైద్యాధికారి శ్రీదేవి, విద్యాధికారి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పనులు చేస్తూ ఉపాధికూలీ మృతి



నర్సమ్మ మృతదేహం

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు వెళ్లి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుద్దాల నర్సమ్మ(62) ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తుండగా కిందపడిపోయింది. వెంటనే గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. కూలీ పనులకు వచ్చి మృతి చెందడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం నర్సమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

చిట్యాలలో గుర్తు తెలియని వ్యక్తి...

చిట్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం యాచకుడు కొన్ని రోజులుగా ఇక్కడే తిరుగుతున్నాడని, అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. మృతదేహాన్ని మునిసిపల్ సిబ్బంది నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతును కొట్టి డబ్బును దోచుకున్న ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ నవీన్‌కుమార్

అనంతగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రైతును కొట్టి డబ్బు ఎత్తుకెళ్లిన దొంగలను పట్టుకొని చోరీ చేసిన నగదు, సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం కోదాడ రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 18న అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన రైతు కొండబాల పుల్లయ్య ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బు రూ.1,77,817లను తీసుకొని ఇంటికి వస్తున్నాడు. సుమారు 10 కిలోమీటర్లు వెళ్లాక అతడిని వెనుక నుంచి స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఉప్పుతల అశోక్‌కుమార్, షేక్ నవాబ్‌షరీఫ్ అలియాస్ సోను, దేవన్న రాజా శాంతినగర్ వద్ద పుల్లయ్యను కొట్టి డబ్బులు తీసుకుని పారిపోయారు. దీంతో పుల్లయ్య అనంతగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. నాలుగు రోజుల అనంతరం శనివారం తెల్లవారుజామున మండలంలోని బొజ్జగూడెంతండా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అశోక్, సోను, రాజాలు స్కూటీపై వస్తుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ నెల 18న పుల్లయ్యను కొట్టి డబ్బును చోరీ చేసింది తామేనని విచారణలో అంగీకరించారు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి కోదాడ మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. నిందితుల స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట గ్రామం అని సీఐ తెలిపారు. వీరు గతంలో కూడా అనేక నేరాలలో దోషులుగా ఉన్నారని చెప్పారు. వీరి నుంచి రూ.లక్షా 70 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను త్వరగా పట్టుకొని డబ్బు రికవరీ చేసిన ఎస్‌ఐ నవీన్‌కుమార్, పోలీస్‌సిబ్బందిని సీఐ అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండుట్రాక్టర్లను యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీసులు పట్టుకున్నారు. చిర్రగూడూరు గ్రామ శివారులోని బిక్కేరు వాగు నుంచి గ్రామానికి చెందిన శీల మహేందర్, గూడ మహేష్ ఎలాంటి అనుమతుల్లేకుండా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. సమాచారం అందుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం



మహేష్(ఫైల్‌ఫొటో)

మోటకొండూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జటంటి కొమురయ్య, కొమురమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు జటంగి మహేష్(28) హైదరాబాద్‌లో కారు నడుపుతు ఉపాధి పొందుతున్నడు. మహేష్‌కు మార్చి 2న వివాహం నిశ్చయించారు. ఆ పెళ్లి పనుల్లో కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ వివాహం మహేష్‌కు ఇష్టం లేదు. శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. రాత్రి 11.30 గంటల సమయంలో గదిలోకి వెళ్లిన తండ్రి కొమురయ్యకు మహేష్ ఉరివేసుకుని కనిపించాడు. అప్పటికే మృతి చెందాడు. తండ్రి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక క్రిమిసంహారక మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని అభంగాపురం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం అభంగాపురం గ్రామానికి చెందిన కోరె లలిత(47) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ పలుమార్లు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 10న క్రిమిసంహారక మందు తాగి స్పృహ కోల్పోయింది. గమనించిన స్థానికులు లలితను వెంటనే నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కృష్ణ తెలిపారు. లలితకు భర్త దేవేందర్, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కోరె రాజేష్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ తిట్టిందని...

నిడమనూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళ తిట్టిందని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వెంగన్నగూడెం శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుంటిగొర్లగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఎల్లయ్య(60) గొర్లకాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఎల్లయ్యతో పాటు వల్లభాపురం, శాఖాపురం, మార్లగడ్డతండా గ్రామాలకు చెందిన మరికొందరు గొర్రెలకాపరులు వెంగన్నగూడెం గ్రామ శివారులోని మేరెడ్డి వంశీవర్ధన్‌రెడ్డికి చెందిన పత్తిచేనును కౌలుకు తీసుకొని జీవాలు మేపుకుంటూ మందలను అక్కడే ఉంచి వారు కూడా అక్కడే ఉంటున్నారు. కాగా సొంత గ్రామానికి చెందిన ఓ మహిళతో ఎల్లయ్య తగాదా పెట్టుకున్నాడు. సదరు మహిళ ఎల్లయ్య గొడవ పడిన విషయాన్ని తన అత్తకు చెప్పగా ఆమె ఎల్లయ్య ఉంటున్న గొర్రెలమంద వద్దకు శుక్రవారం రాత్రి వచ్చి తిట్టింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన గొర్రెలదొడ్డికి దగ్గరలో ఉన్న ఓ వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం నిద్రలేచిన తోటి గొర్రెలకాపరులు ఎల్లయ్య చెట్టుకు ఉరేసుకొని ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎల్లయ్య కుమారుడు శ్రీను ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రీకాస్ట్‌వాల్స్ మీద పడి వ్యక్తి మృతి



భువనగిరిలో రోడ్డుపై పడిన ప్రీకాస్ట్ వాల్స్

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వరుసగా వెళ్తున్న రెండు వాహనాల డ్రైవర్లు వేసి సడన్ బ్రేకులతో జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నారపల్లి నుంచి భువనగిరి పట్టణ శివారులోని రాయగిరికి ప్రహరీగోడలు నిర్మించేందుకు వినియోగించే సిమెంట్ పలకల(ప్రీ కాస్ట్ వాల్స్)ను ట్రాలీ వాహనంలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి బైపాస్ రోడ్డులోని సింగన్నగూడెం చౌరస్తా సమీపంలో ట్రాలీ వాహనం ముందు వెళ్తున్న కారు వేసి సడన్ బ్రేక్ వేయడంతో ఆ వెనకాలే ఉన్న ఆటో ట్రాలీ డ్రైవర్ కూడా సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో ట్రాలీ అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు రోడ్డుపై జారిపడిన వెంటనే వారిపై సిమెంట్ పలకలు పడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడిన బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీ ముఖేష్ సహని(27) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఇదే ఘటనలో మరో ముగ్గురు కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ముఖేష్ సోదరుడు అమర్జిత్ సహని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తెలిపారు. స్వల్పంగా గాయపడిన ముగ్గురు కూలీలకు జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు అందించారు.

ఆటో బోల్తా : ప్రయాణికులు క్షేమం

మునగాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి శనివారం బోల్తా పడింది. 10 మంది ప్రయాణికులతో కోదాడ వైపు వెళుతున్న ఆటో అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడింది. ఆటోలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. రహదారిపై ఆటో పడటంతో దాదాపు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ వారు వెంటనే వచ్చి, పడిపోయిన ఆటోను పక్కకు తీశారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.

హైవేపై కారు దగ్ధం



జాతీయరహదారిపై దగ్ధమైన కారు

మునగాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కారు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల శివారులో జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి యుగంధర్, సత్యనారాయణలు కారులో బాపట్ల వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని ఆకుపాముల వద్ద కారు ఇంజన్ నుంచి పొగలు రావటం గమనించి, కారు పక్కకు నిలిపారు. కొద్ది నిమిషాల్లో మంటలు మరింతగా పెరిగి కారు వారి కళ్ల ముందే దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు ఫైర్‌సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మూడోసారి సాగర్ అటవీ ప్రాంతంలో మంటలు

● 100 ఎకరాల మేర దగ్ధమైన గడ్డి



నాగార్జునసాగర్ అటవీ ప్రాంతంలో వ్యాపించిన మంటలు ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ అటవీ ప్రాంతంలో వారం వ్యవధిలో మూడోసారి మంటలు చెలరేగాయి. శనివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నాగార్జునసాగర్ డివిజన్ అటవీ ప్రాంతంలో నెల్లికల్లు బీట్‌లో సమ్మక్క-సారక్క గద్దెల వద్ద నుంచి దెయ్యాల గండి వరకు వంద ఎకరాల మేర మంటలు వ్యాపించాయి. మంటలు వ్యాపించిన విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది హాలియా ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో పాటు సాగర్ అటవీ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఎయిర్ బ్లోయర్స్‌తో మంటలను ఆరు గంటలు శ్రమించి అదుపులోకి తీసుకువచ్చారు. వేసవి కాలం కావడంతో ఏపుగా పెరిగిన గడ్డంతా ఎండిపోయి ఉండటం వల్ల గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. అడవిలో నిప్పు వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి రాఘవేంద్ర హెచ్చరించారు. సాగర్ అటవీ శాఖకార్యాలయంలో కేవలం ఎయిర్ బ్లోయర్లు మాత్రమే ఉండటంతో మంటలు ఆర్పడానికి సిబ్బంది నానాఇబ్బందులు పడాల్సి వస్తుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. సాగర్ అటవీశాఖ కార్యాలయానికి ఫైర్ ఇంజన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తెలంగాణ దశ, దిశను మార్చే ఎన్నికలు

● రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

నల్లగొండ రూరల్, నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ దశ, దిశను మార్చే ఎన్నికలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి(బీసీ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు) టీ చిరంజీవులు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు మద్దతుగా శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్టేషన్‌హోటల్‌లో బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 90శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికార సాధన కోసం ఈ ఎన్నికలు తొలిమెట్టు అన్నారు. ఎన్నో ఏళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు అగ్రవర్ణాల జెండాలు, అజెండాలు మోసేవారుగా ఉన్నారని అన్నారు. ఓటు ద్వారా వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, బీసీలకు ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. ఇది బీసీల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగం నుంచి వచ్చిన, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి పూల రవీందర్ అన్నారు. ఆయన ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడారన్నారు. గతంలో ఎమ్మెల్సీగా మెరుగైన పీఆర్సీతో పాటు ఎన్నో ఉపయుక్తమైన జీవోలను సాధించారన్నారు. ఉపాధ్యాయులు తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని, బీసీ, బహుజన వాదాన్ని గెలిపించాలన్నారు. ఈసారి బహుజన వాదాన్ని గెలిపిస్తే భవిష్యత్‌లో బహుజనులు మంచి స్థానాల్లో ఉంటారన్నారు. బీసీ మేధావుల ఫోరం పూల రవీందర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు.


కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి బిక్షపతి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, నకిరేకంటి కాశయ్యగౌడ్, శ్యాంసుందర్, తిరందాసు రాందాసు, పెండెం శ్రీనివాసులు, మేడె రామకృష్ణ, సమీర్‌కుమార్, యాదగిరి, చామల చంద్రశేఖర్, సైదులురావు, సమీర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనుల అడ్డగింత

మర్రిగూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పునరావాసం కల్పించాలంటూ నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్లగూడ రిజర్వాయర్ పనులను నర్సిగూడెం భూనిర్వాసితులు శనివారం అడ్డుకున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్ట నిర్మాణానికి వినియోగిస్తున్న వాహనాలను అడ్డుకొని పనులు చేపట్టనిచ్చేది లేదంటూ బాధితులు తెలిపారు. అర్హులైన 32మంది బాధితులకు పునరావాసం కల్పించలేదని, కొందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించలేదంటూ బాధితులు వాపోయారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు భూనిర్వాసితులతో మాట్లాడారు. ఏఒక్కరూ అధైర్యపడ్డవద్దని, అధికారులు నచ్చజెప్పి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో పనులు ఆందోళన విరమించారు. పనులు యథావిధిగా కొనసాగాయి.

నిజాయితీ చాటుకున్న డీటీ

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో డబ్బు జారవిడుచుకున్న రైతుకు తిరిగి అందించి పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎం.రఘునందన్ శనివారం నిజాయితీని చాటుకున్నారు. నల్లగొండ జిల్లా జిల్లా చింతపల్లి మండలకేంద్రానికి చెందిన ఐలయ్య తన కుమార్తె వివాహానికి డబ్బుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ప్లాట్ కాగితాలు తాకట్టు పెట్టి రూ.50000 తీసుకుని దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎక్కి వస్తున్నాడు. అదే బస్సులో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎం.రఘునందన్ చింతపల్లికి వస్తున్నారు. చింతపల్లి రాగానే ఐలయ్య బస్సు దిగేందుకు వెళ్తున్నాడు. ఆయన జేబులో నుంచి డబ్బులు పడిపోయాయి. వెనక ఉన్న డీటీ గమనించి ఐలయ్యను పిలిచి రూ.50 వేలను తీసుకుని ఆయనకు అందించారు.



సీఎం సారూ... సమస్యలపై దృష్టిపెట్టరూ?

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట ప్రజలు సమస్యలతో స్వాగతం పలకనున్నారు. పాతగుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట దేవాలయం వరకు రోడ్డు శిథిలమై జట్కా బండ్లు, వాహనాల్లో వెళ్లే భక్తులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు మరమ్మతులు చేయాలని విన్నవించనున్నారు. అదేవిధంగా వైటీడీఏ అభివృద్ధిలో భాగంగా పాతగుట్ట చౌరస్తా నుంచి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు, స్థలాలు కోల్పోయారు. వారికి ఆర్టీసీ డిపో పరిధిలో 200ల గజాలు చొప్పున స్థలాలు కేటాయించి తాత్కాలిక భూమి పత్రాలను ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అదేవిధంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బాధితులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. స్థానిక సింహద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు గతం ప్రభుత్వం నిర్మాణం చేసిన ఫ్లైఓవర్ (రిటర్నింగ్ వాల్)తో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దాంతో ఫ్లైఓవర్‌ను తొలగించి సమస్యను పరిష్కరిస్తారని ఎదురు చూస్తున్నారు. మునిసిపల్ శాశ్వత భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి నిత్యం స్వామివారిని దర్శించుకొనే భక్తులు, ప్రజలకు వైద్యసేవలు అందించడానికి కేవలం ఆరుపడకల ప్రాథమిక కేంద్రం తప్ప పెద్దఆసుపత్రులు లేవు. 100 పడకల ఆసుపత్రికి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసినా పనులు మొదలుపెట్టలేదు. వెంటనే పనులు ప్రారంభించి సేవలు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన చేస్తారని స్థానిక ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలేవీ?

● ప్రజలకు కొరవడిన అవగాహన

● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

వాతావరణంలో వస్తున్న మార్పులు, వర్షాల లేమి(అనావృష్టి) కారణంగా భూగర్భజలాలు ఏడాదికింత లోతుకు పడిపోతున్నాయి. నీటిఎద్దడిని వేసవి వస్తేగాని గుర్తించలేకపోతున్నారు. పట్టణాల్లో మిషన్ భగీరథ, మునిసిపల్ బోర్లు, బావులతో నల్లాల ద్వారా అందిస్తున్నా నీరు ప్రజలకు సరిపోవడంలేదు. ఫలితంగా ఇంటికో బోరు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వేసవిలో ఇళ్లలోని కొన్ని బోర్లు ఒట్టిపోతున్నాయి. కొందరు ఇళ్లలో సంపులు నిర్మించుకుని ట్యాంకరు ద్వారా నీటిని తెచ్చి అందులో పోసి వాడుకుంటున్నారు. మరికొందరు మునిసిపల్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని తెచ్చుకుని వాడుకుంటున్నారు. పట్టణాల్లో ఇల్లు నిర్మించేప్పుడు ప్రతీ ఇంటికి బోరు వేస్తున్నారు. కానీ బోరు నీటి రీచార్జికి ఉపయోగ పడే ఇంకుడు గుంత నిర్మాణాన్ని మాత్రం విస్మరిస్తున్నారు. ఇంకుడు గుంతల ప్రయోజనాలపై సరైన అవగాహన లేకపోవడం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయాల్సిన ఇంకుడుగుంతల నిర్మాణాన్ని అధికారులు పర్యవేక్షించకపోవడంతో యాదాద్రిభువనగిరి జిల్లావ్యాప్తంగా మునిసిపాలిటీల్లో ఇంకుడుగుంతల నిర్మాణం అంతంత మాత్రంగానే ఉంది.

జిల్లాలోని మునిసిపాలిటీల్లోని ఇంకుడుగుంతలు

మునిసిపాలిటీ	మొత్తం	300చ.మీ. భవనాలు	ఇంకుడు గుంతల భవనాలు
మోత్కూరు	5,019	256	51
భువనగిరి	14,622	81	44
చౌటుప్పల్	7,316	--	33 (హెచ్‌ఎండీఏ లేఅవుట్లలో)
యాదగిరిగుట్ట	6,225	22	22
ఆలేరు	5,222	26	----
పోచంపల్లి	5,096	28	4
మొత్తం	43,500	413	154

ఇంకుడుగుంతలతో బోరు రీచార్జి


గతంలో మట్టి రోడ్ల వీధులు, ఇళ్ల ముందు, వెనక ఖాళీ స్థలాలు ఉంటే వర్షపు నీరు భూమిలో ఇంకేది. ఇప్పుడు శ్లాబ్ ఇళ్లు, వీధుల్లో సీసీరోడ్లు, ఇంటి ముందు, వెనుక ఉంటున్నదే తక్కువ స్థలం. అదీ సీసీ చేయడమో, టైల్స్ వేయడమో చేస్తున్నారు. దీంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే ఆస్కారం లేకుండాపోతోంది. భూమిలో నీరు ఇంకని కారణంగా బోర్లు వట్టిపోతున్నాయి. వర్షపు నీటిని ఒడిసిపట్టి బోర్లను రీచార్జి చేయడానికి ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతీ ఇంటికి ఒక ఇంకుడుగుంత నిర్మించి వర్షపు నీరు అందులోకి వదిలితే బోరు రీచార్జి అవుతుందంటున్నారు.



ఇంకుడుగుంత నిర్మాణం ఇలా...

ఇంటి ఖాళీ స్థలంలో 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల పొడవు, 8 అడుగుల లోతు గుంత తీయాలి. అందులో అడుగున రెండు అడుగుల మందం 40ఎంఎం కంకర వేయాలి. గుంతలో మట్టి పడకుండా కంకరపైన చుట్టూ ఇటుకతో గోడ కట్టాలి. మరో రెండు అడుగులు 20 ఎంఎం కంకర వేసి చదును చేయాలి. దానిపై అడుగున్నర మందం ఇసుక వేసి చదునుచేయాలి. దానిపై దోమ తెర లాంటి నైలాన్ జాలి పర్చి పైన కప్పు వేయాలి. ఇంటి శ్లాబ్‌పై పడే వర్షపు నీరు అందులోకి వెళ్లేలా పైపు అమర్చాలి. వర్షపు నీరు అందులో ఇంకి బోరులోకి నీరు వెళుతుంది. కొందరు రిస్క్ తగ్గించుకోవడానికి సిమెంటు రింగులతో కూడా ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు.

300 చ.మీ. విస్తీర్ణం పైబడి



మునిసిపాలిటీల్లో 300చ.మీ విస్తీర్ణం, ఆ పైబడిన భవనాల నిర్మాణాలకు తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించాలన్న నిబంధన ఉంది. దీంతో మునిసిపాలిటీల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్నప్పుడు 300 చదరపు మీటర్ల విస్తీర్ణంపై బడిన ఇంటిలో ఇంకుడు గుంత నిర్మాణానికి చదరపు మీటరుకు రూ.10 చొప్పున డిపాజిట్ ఇంటి నిర్మాణ అనుమతి రుసుంలో కలిపి వసూలు చేస్తున్నారు. యజమాని ఇంకుడు గుంత నిర్మించి చూపితే ఆ డబ్బు వాపసు ఇస్తారు. దీనిపై అధికారులు ఇళ్ల యజమానులకు సరైన అవగాహన కల్పించడం లేదంటున్నారు. దాంతో ఇళ్ల యజమానులు ఇంకుడు గుంతల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు.

● ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పిస్తాం



మోత్కూరు మునిసిపల్ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా. 300 చదరపు మీటర్లు, ఆ పైబడిన విస్తీర్ణంలో నిర్మించే భవనాల్లో తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించాలి. ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాల్సిన ఆవశ్యకత, వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. ఇంటి అనుమతిలో ఇంకుడు గుంత నిర్మాణ డిపాజిట్ ఉంటున్నందున యజమానులు ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే ఇంకుడు గుంత నిర్మించి డిపాజిట్ వాపసు తీసుకోవచ్చు.

కే సతీష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్, మోత్కూరు

యాగశాలలో ఏకాశీతి కలశ స్నపనం



యాగశాలలో ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు నల్లన్‌థిఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు నాలుగో రోజుకు చేరాయి. శాస్త్రోక్తంగా శనివారం యాగశాలలో నిర్వహించిన హోమాలు, జపాలు, పారాయణాలు వైభవంగా కొనసాగాయి. వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ రుత్వికులు వేడుకలు జరిపారు. ఆలయం నుంచి ఉత్సవమూర్తులను తిరువీధి సేవ చేపట్టి యజ్ఞశాలకు చేర్చారు. అనంతరం చతుస్థానార్చన, విమాన అధిష్ఠాన పరివార హోమాలు, ఏకాశీతి కలశ స్నపనం నిర్వహించారు. అలాగే మూలమంత్ర, మూర్తి మంత్ర హవనాలు, నిత్యపూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్రపుష్పం, శాత్తుమురై శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం మహావిష్ణు సహస్రనామ పారాయణాలు, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధనలు చేపట్టిన అనంతరం తిరువీధి సేవ నిర్వహించి ఉత్సవమూర్తులను ఆలయ ప్రవేశం చేశారు. యాగశాలలో రామానుజ జీయర్‌తోపాటు కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. వేడుకలు ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు భట్టర్ సురేంద్రచార్యులు, కొడకండ్ల మాధవాచార్యులు, యజ్ఞాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు. వేడుకల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఆలయ ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్ కుమార్‌శర్మ, దూశెట్టి కృష్ణ, గజ్వెల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, దీరావత్ రామరావునాయక్ పాల్గొన్నారు.

ఏకాశీతి కలశ స్నపనం ప్రత్యేకత

ఏకాశీతి (81) కలశాలను స్థాపించి సమస్త దేవతలను అందులోకి ఆహ్వానించారు. స్వరూప స్వభావాలను కలిగిన తత్వాలను ఆహ్వానించి నదీజలాలు, ధాన్యోదకాలు, చిరుధాన్యాలు, సుగంధ, పరిమళ ద్రవ్యాలు నింపి మంత్ర పఠనాలతో ఆరాధన చేపట్టారు. కలశాలలో దర్భకూర్చలను ఉంచి విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర మంత్రాలతో ఆవాహన చేసుకొని ఆ శుద్ధోదక జలాలను మహాభిషేక నిర్వహణలో సంప్రోక్షణ చేశారు.

సంగీత సభలు

సంగీత సభల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శారద సంగీత విద్యాలయం (శారద) భక్తి సంగీతం, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు అభినయ నృత్యజ్యోతి (పద్మజ) భరతనాట్యం, 8 నుంచి 9 గంటల వరకు లలిత స్కిల్ ఆఫ్ డాన్స్ (లలిత సింధూరి) కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది.

మూడోసారి సీఎం పర్యటన

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి తొలిసారి యాదగిరిగుట్ట క్షేత్ర పర్యటనకు వచ్చారు. 2024 నవంబరు 8న సీఎం జన్మదినం సందర్భంగా రెండోసారి రాగా నేటితో మూడోసారి క్షేత్ర పర్యటనకు వస్తున్నారు.

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక

మాజీ సీఎం కేసీఆర్ ఇప్పటికి 21సార్లు యాదగిరిగుట్ట క్షేత్ర పర్యటనకు వచ్చారు. ఈ నెల 21న ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను ఆలయ అధికారులు, అర్చకులు ఆశీర్వచనం చేసి ఆహ్వాన పత్రిక అందజేశారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

నేడు స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేకం

నేటి నుంచి భక్తులకు దర్శనం

యాదాద్రి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో దివ్య స్వర్ణ విమాన గోపురం ప్రతిష్ఠామహోత్సవానికి సర్వం సన్నద్ధమైంది. వేదపండితులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఆదివారం ఉదయం 11.54గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కారంశ సముహూర్తాన శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ స్వామివారికి గోపురాన్ని అంకితం చేయనున్నారు. ఈ నెల నుంచి ప్రారంభమైన పంచకుండాత్మక నృసింహ మహాయాగం నేటితో పరిసమాప్తికానుంది. మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. సీఎం యాదగిరిగుట్ట పర్యటన ఖరారైంది. ఈ కార్యక్రమంలో సీఎంతోపాటు పలువురు రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పలు మఠాధిపతులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీమత్సర మహంస పరివ్రాజకాచార్య శ్రీమద్ వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్య వానమామలై మఠం 31వ పీఠాధిపతులు మధుర కవి రామానుజ జీయర్‌స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి మహాశివరాత్రోత్సవాలు

- ఉదయం 11.30 గంటలకు స్వస్తివాచనం
- 28న పూర్ణాహుతితో ఉత్సవ పరిసమాప్తి
- మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శివకేశవుల క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట అనుబంధ ఆలయం పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర ఆలయంలో ఏటా జరిగే మహా శివరాత్రోత్సవాలు ఆదివారం ఆరంభంకానున్నాయి. ఉదయం 10.30గంటలకు శైవసంప్రదాయం ప్రకారం గణపతికి తొలిపూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆరు రోజులపాటు జరిగే మహోత్సవాల కోసం అధికారులు భక్తులకోసం తాగునీటి వసతి, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలతో సర్వాంగసుందరంగా ఆలయాన్ని అలంకరించారు. హోమపూజల నిర్వహణ కోసం శివాలయం ముందు హోమగుండం నిర్మించారు. మహోత్సవాల్లో విశేష దినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండనున్నందున స్వామి దర్శనాలు, మొక్కు పూజల నిర్వహణకు ప్రత్యేక క్యూలైన్లు రూపొందించారు. మహోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన శివపార్వతుల కల్యాణ వేడుకలు ప్రత్యేక వేదిక, శామియానాల ఏర్పాట్లను అధికారులు నిర్వహిస్తున్నారు. కాగా, శివాలయంలో కొలువుదీరిన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామికి నిత్య విధి పూజాకైంకర్యాలు ఆస్థానపరంగా పూజారులే జరుపుతున్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

శివాలయంలో ఆదివారం ఉదయం 11.30 గంటలకు స్వస్తివాచనం, అంకురారోపణతో ప్రారంభించేందుకు ఆచార్యులు, అధికారులు సర్వం సిద్ధంచేశారు. 24న (ఏకాదశి) ఉదయం 11.30 గంటలకు ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరీపూజ, అగ్నిప్రతిష్ఠ, 25న రుద్రహవనం, ముఖ్య ఘట్టమైన శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారి కల్యాణం, 26న (మహా శివరాత్రి) అభిషేకాలు, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాలు, 27న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు లక్ష బిల్వార్చన, రాత్రి 7.40 గంటలకు రథోత్సవం, 28న ఉదయం 11.30 గంటలకు పూర్ణాహుతి, త్రిశూల తీర్థ కార్యక్రమాలతో శివరాత్రోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

పూజలు రద్దు

మహాశివరాత్రోత్సవాల సందర్భంగా కొండపైన శివాలయంలో నిత్యహోమాలు, ప్రతీ శుక్రవారం చేపట్టే చండీ యాగం రద్దు చేశారు. 25న నిర్వహించే పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.516, 26న మహాశివరాత్రి పర్వదినాన అభిషేకాలు రూ.300, రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు శతరుద్రాభిషేకం, 27న మధ్యాహ్నం లక్షబిల్వార్చనలో రూ.516 టికెట్ పొంది పూజల్లో పాల్గొనవచ్చు. అదేవిధంగా కాలక్షేపంకోసం ఆలయంలో హరికథ, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



నేడు గుట్టకు సీఎం రేవంత్‌రెడ్డి

యాదాద్రి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి ఈ నెల 23న ఉదయం హైదరాబాద్ నుంచి హెలీక్యాప్టర్ ద్వారా చేరుకుంటారు. ఉదయం 11గంటలకు యాదగిరిగుట్టకు హెలీక్యాప్టర్‌లో విచ్చేస్తారు. 11.10 గంటలకు ఘాట్ రోడ్డు ద్వారా కొండపైన ఉన్న దేవాలయ అతిథి గృహానికి చేరుకుంటారు. 11.20నిమిషాలకు లిఫ్టు ద్వారా కొండపైన ఏర్పాటు చేసిన యాగశాలలో పూజల్లో పాల్గొంటారు. 11.30 గంటలకు పూర్ణాహుతితో ఉత్తర రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశిస్తారు. పశ్చిమ తిరువీధి ద్వారా దక్షిణ తిరువీధి నుంచి చెక్కమెట్ల గుండా 11.40గంటలకు స్వర్ణ దివ్య విమాన గోపురం వద్దకు చేరుకుంటారు. ఉదయం 11.54గంటలకు మహాకుంభాషేకరం పూర్తి కాగానే త్రితల రాజగోపురం ద్వారా ప్రధానాలయంలోకి ప్రవేశిస్తారు. 12.20గంటల వరకు స్వామివారి గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 12.40గంటలకు ముఖ్యమంత్రికి స్వామివారి ఆశీర్వచనాలు, ప్రసాదాలను అందజేస్తారు. సంప్రోక్షణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్వర్ణ విమానగోపురం ప్రతిష్ఠాత్మకోత్సవంతోపాటు ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్య అతిథులు, విశేష అతిథులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సంప్రోక్షణ పూజల్లో కొండపైన దాదాపు 20వేల నుంచి 25 వేల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రధానాలయంలోని స్వామివారి విమానగోపురం చుట్టూ వేదపండితులు, ప్రజాప్రతినిధులు, మీడియా, దాతలు కూర్చొని పూజలు వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేసిన అధికారులు

దేశంలోనే ఎత్తయిన గోపురం

● యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు




కలెక్టర్ హనుమంతరావుకు ఆశీర్వచనం ఇస్తున్న జీయర్‌స్వామి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ చరిత్రలో నిలిచిపోయేలా దేశంలో అత్యంత ఎత్తయిన స్వర్ణ దివ్య విమాన రాజగోపుర ఆవిష్కరణ ఘడియలు దగ్గరపడుతున్నాయని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. యాదగిరికొండపై ఏర్పాట్లను పరిశీలించి, సమీక్షలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రామానుజ జీయర్ ఆధ్వర్యంలో రుత్వికుల వేద పారాయణాలతో అంగరంగా వైభవంగా హవనాలు కొనసాగుతున్నాయన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి మహాకుంభాభిషేకంలో సుమారు 10నుంచి 15 మంది భక్తులు పాల్గొంటారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలు స్వర్ణ గోపుర ఆవిష్కరణ వేడుకల్లో భాగం కానున్నారన్నారు. భక్తులకు కావాల్సి తాగునీరు, కార్పెట్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు వీక్షించేందుకు ఎల్‌ఈడీలు సిద్ధం చేసినట్లు తెలిపారు. 11గంటల నుంచి 12.45 గంటల వరకు సీఎం పర్యటన వీక్షించొచ్చన్నారు. వాహన రద్దీని తగ్గించేందుకు 10 బస్సులు అదనంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, కమిషనర్ ఎస్.శ్రీధర్, ఆలయ ఈవో భాస్కర్‌రావు ఏర్పాట్లలో రాజీ పడలేదన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటన సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. యాదగిరికొండపై శనివారం సీఎం పర్యటన సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భాస్కర్‌రావు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేసి మాట్లాడారు. 350మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే దాతలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల సౌకర్యార్థం కొండపైన హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, భువనగిరి జోన్ డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, పోలీసు అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

స్వర్ణ గోపుర ఆవిష్కరణ మహోత్సవానికి భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, తొమ్మిది మంది ఏసీపీలు, 20మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో కలిపి సుమారు 500మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యారాధనలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.39,62,112 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ రాష్ట్రనేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. భద్రతా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో పలువురు ప్రధాన ఆలయంలో సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు.

ఎస్‌ఎల్‌బీసీ పనులపై నీలినీడలు

(5వపేజీ తరువాయి)


ఇటీవలే చెన్నై పోర్టుకు చేరగా ఈ నెలాఖరులోగా మన్నెవారిపల్లి వద్దకు చేరుతుందని ఇరిగేషన్ ఇంజనీర్లు భావిస్తున్న తరుణంలో, తాజాగా ఇన్‌లెట్ వైపున భారీ ప్రమాదం చోటుచేసుకోవడంతో పనులు ముందుకుసాగడంపై ప్రభావం చూపనుంది.

ఆరేళ్లుగా నిలిచిన పనులు

ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు 2015వరకు ఉధృతంగా సాగాయి. ఆతర్వాత బేరింగులు మరమ్మతులకు రావడం, మరోవైపు ఇన్‌లెట్ వైపున ఊట నీరు వస్తుండడంతో పనులు మందగించాయి. 2019 నుంచి కాంట్రాక్ట్ సంస్థ సైతం నిర్వహణ భారం పెరగడం, ప్రాజెక్టు వ్యయం పెరిగిపోవడంతో పనులను నిలిపింది. తిరిగి 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించిన సీఎం, మంత్రులు ప్రాజెక్టు వ్యయం పెంచడంతో పాటు, బిల్లులు పెండింగ్‌లో లేకుండా గ్రీన్‌ఛానల్‌లో నిధులిస్తామని హామీ ఇచ్చి కాంట్రాక్ట్ సంస్థను ఒప్పించారు. దీంతోపాటు బేరింగ్ తెప్పించడం, ఇన్‌లెట్‌వైపున పనులు సాగించేందుకు అవసరమైన కార్యాచరణను ప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, భారీనీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సెప్టెంబరులో ప్రాజెక్టును సందర్శించి అక్కడే సమీక్ష సైతం నిర్వహించారు. ఈ ఏడాది బడ్జెట్ లోనూ రూ.800కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనులు ఊపందుకుంటాయని భావించిన తరుణంలో ఈ ప్రమాద ఘటనతో మళ్లీ పనులకు బ్రేక్ పడినట్లయింది.

అటవీ అనుమతులు, పునరావాస పనులూ పెండింగ్‌లోనే

ఈ ప్రాజెక్టుకు కీలకమైన అటవీ అనుమతులతో పాటు, నిర్వాసితుల పునరావాసకల్పన సైతం పెండింగ్‌లోనే ఉంది. తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మిస్తున్న నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) రిజర్వాయర్‌లో ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు పూర్తయినా, ముందడుగు పడలేదు. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దీనికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ ఆవల ఇతర ప్రాంతాల్లో 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ సంసిద్ధత వ్యక్తం చేసింది. కీలకమైన ఈ అనుమతులు వస్తేనే నక్కలగండి రిజర్వాయర్ అందుబాటులోకి వస్తుంది. ఇదే నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంతో నల్లగొండ జిల్లాలోని చందంపేట మండలంలోని నక్కలగండితండా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలంలోని కేశ్యతండ, మర్లపాడుతండాలు ముంపునకు గురవుతున్నాయి. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడుతండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులవుతుండడంతో వారికి పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. నల్లగొండ జిల్లాలో ముంపు ప్రాంతమైన నక్కలగండి తండాకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించారు. అక్కడ ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ నిర్మించాలని నిర్ణయించినా, ఇంకా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. అటు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడుతండాలకు సంబంధించి పునరావాస కేంద్రాలను తొలుత సిద్ధాపూరం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు నిర్వాసితులు అంగీకరించలేదు. దీంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా మూడు ముంపు తండాలకు పునరావాస కాలనీలు, ప్యాకేజీల పరిష్కారం పూర్తికాలేదు.



టన్నెల్ పనుల కొనసాగింపుపై సందిగ్ధం

ఇన్‌లెట్ దుర్ఘటనతో పనులు కొనసాగించడంపై ఇంజనీరింగ్ వర్గాల్లో భిన్న చర్చ కొనసాగుతోంది. ఇన్‌లెట్‌వైపున భారీగా ఊటనీరు వస్తోందని, దీంతో ఆ ప్రాంతంలో తవ్వకాలు నిర్వహిస్తున్న సందర్భంలో పైకప్పు కూలిపోతుందని, దాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోవడం వల్లే తాజా దుర్ఘటన జరిగిందని ఇంజనీరింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఇన్‌లెట్ సొరంగం సముద్రమట్టానికి 854 అడుగుల ఎత్తు వద్ద తవ్వుతుండగా, శ్రీశైలం రిజర్వాయర్ 885 అడుగుల ఎత్తు వద్ద నీటితో ఉంది. శ్రీశైలం రిజర్వాయర్ కంటే ఇది దిగువన ఉండడం కూడా ఊటనీరు అధికంగా రావడానికి కారణంగా చెబుతున్నారు. వీటన్నింటిపై మరోసారి ఇంజనీరింగ్, సాంకేతిక నిపుణులతో ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమీక్షించిన తర్వాతనే పనులు ముందుకుసాగడంపై నిర్ణయం తీసుకుంటారని, అప్పటివరకు పనులు నిలిచినట్టేనని చెబుతున్నారు. ఈ ప్రమాదఘటన అంశం కొలిక్కివచ్చాకే పనుల భవిష్యత్‌పై నిర్ణయం ఉంటుందనే చర్చ సాగుతోంది.

మహా కుంభమేళాకు వెళ్లొస్తుండగా..

● రోడ్డు ప్రమాదంలో 11 మందికి తీవ్ర గాయాలు



108లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మోటకొండూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు వెళ్లి, తిరిగి వస్తుండగా శనివారం తెల్లవారుజామున నిజమబాద్ జిల్లా నిర్మల్ మండలం బుస్సాపూర్ 44వ జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామానికి చెందిన దొంతి ఎల్లేష్, మల్ల బాలయ్య, మల్ల అయిలయ్య, గుర్రాల మత్స్యగిరి, మల్ల మధు, జక్క జనార్దన్, సుబ్బయ్య, చాడ మధిర గ్రామం గడ్డగొల్లబావికి చెందిన సలేంద్ర గట్టయ్య, సలేంద్ర మురళీ, నాంచారిపేట గ్రామానికి చెందిన కుస్కు పెంటారెడ్డి, కాటేపల్లి గ్రామానికి చెందిన పీసరి నర్సిరెడ్డి శివమాల ధరించారు. ఈ నెల 17న చాడ గ్రామం నుంచి తుఫాన్ వాహనంలో దైవదర్శనంకోసం ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వెళ్లి తిరిగి వస్తుండగా, వాహనం అదుపుతప్పి బోల్తా పడగా వీరు తీవ్రంగా గాయపడ్డారు. అందులో మల్లా బాలయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఎల్లేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా, మురళీ, సలేంద్ర గట్టయ్య, మత్స్యగిరి, మల్లా అయిలయ్య, కుస్కు పెంటారెడ్డి, పీసరి నర్సిరెడ్డి వ్యవసాయం, మల్లా మధు ఫొటోగ్రాఫర్‌గా, జక్క జనార్ధన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరందరికీ నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. శనివారం ఉదయం గాయలైన వీరిని నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఫీర్జాదిగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మధు, మత్స్యగిరి, గట్టయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నిజమబాద్‌లోనే చికిత్స అందిస్తున్నారు.

చికెన్, ఎగ్స్ మేళా

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కోళ్ల మృత్యువాత పడుతుండటం ప్రజల్లో భయాందోళనల కారణంగా చికెన్, గుడ్ల విక్రయుల గణనీయంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో చికెన్, ఎగ్స్ మేళాను నిర్వహించారు. 250 కేజీల చికెన్, కోడి గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, కమిటీ సభ్యులు యాకూబ్అలీ, సలీముద్దీన్, గణేష్, శ్రీశైలం, శంకర్ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం నేడు

మునుగోడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మునుగోడులోని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి, ఫినిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించే వైద్యశిబిరంలో చండూరు మునిసిపాలిటీ, మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు వైద్యచికిత్స అందించనున్నారు. వైద్య శిబిరానికి రావడానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న కైలాస్‌నేత

మునుగోడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణన సర్వే శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవటంపై టీపీసీసీ జనరల్ సెక్రటరీ పున్న కైలాష్‌నేత హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బీసీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నిర్వహించిన సమావేశంలో కైలాష్‌నేత పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను కలిశారు. జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. బీసీల కుల గణనతో ఆయా వర్గాలకు ఎంతో ప్రయోజనం కానుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయకుండా సానుకూల ధోరణితో అనుకూలంగా వ్యవహరించి మద్దతు తెలపాలని హితవు పలికారు.

విరాళం అందజేత

మునుగోడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మునుగోడు శివరామ క్షేత్రంలో ఈనెల 26న జరిగే మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ ఖర్చుల కోసం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తమవంతుగా రూ. 20,116లు ప్రకటించారు. ఆ డబ్బులను ఆలయ కమిటీ చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డికి శనివారం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సైదులు, జిల్లా నాయకుడు జంగిలి నాగరాజు ఉన్నారు.

ఆ రైతులు సహకరిస్తే!

» కొండపాకగూడెం చెరువుకు బీ.వెల్లెంల ప్రాజెక్టు నీరు

» చెరువు నిండితే పెరగనున్న ఆయకట్టు » కాల్వ ఏర్పాటుకు భూమి ఇవ్వాలని రైతుల వేడుకోలు

ఓ ఇద్దరు రైతులు పెద్దమనసు చేసుకుంటే కృష్ణా నీటితో ఓ చెరువు కళకళలాడనుంది. చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగు నీటి కొరత తీరనుంది. భూగర్భ జలాలు పెరిగి ఇటు సాగుకే కాదు...అటు వచ్చే వేసవిలో గ్రామంలో తాగునీటి సమస్యా ఉండదు. కానీ ఆ రైతులు ససేమిరా అనడంతో కళ్లముందే ఎండిపోతూ బీటలు వారుతున్న పంట పొలాలను చూసి పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)





చుక్కనీరు లేని కొండపాకగూడెం చెరువు, నీరు లేక బీటలు వారుతున్న వరి పంట

కొండపాక గూడెంలో ఊర చెరువు ఉంది. కొండపాక గూడెం గ్రామాన్ని కరువు పీడిత ప్రాంతంగా గుర్తించారు. ఇన్నాళ్లుగా వర్షాధారంపైనే వ్యవసాయం చేస్తున్నారు. బోర్లపై ఆధారపడి అవి పోసిన కొద్దిపాటి నీటితోనే నెట్టుకొస్తూ పంటలను సాగు చేశారు. ఆశాదీపంలా కనిపించిన బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం తమ భూములనూ త్యాగం చేశారు. ప్రాజెక్టు ద్వారా నీటి కోసం దాదాపు రెండు దశాబ్దాలుగా వేయి కళ్లతో ఎదురుచూశారు. ఎట్టకేలకు వారి ఎదురుచూపులు ఫలించాయి. కానీ కొండపాకగూడెం చెరువులోకి నీరు చేరేందుకు మైనర్ కాల్వను ఏర్పాటు చేయలేదు. దీంతో చెరువులో నీరు లేక ఆయకట్టులోని రైతుల పొలాల్లో పంట ఎండుతోంది. దీంతో తమ పంట పొలాలను కాపాడుకోవాలనే తపనతో బాధిత రైతులు ఇటీవల అమాత్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించి మొరపెట్టుకున్నారు. వారి బాధను మంత్రి అర్థం చేసుకున్నారు. గ్రామ శివారు నుంచి వెళ్తున్న కాల్వకు తాత్కాలికంగా గండికొట్టి చెరువును నింపుకోవాలని సూచించారు. ఇందుకు అధికారులనూ ఒప్పించారు.

ఆ నీరు చెరువుకు చేరాలంటే

రిజర్వాయర్ నుంచి అవురవాణి, అప్పాజిపేట కాల్వను తవ్వుతున్నారు. ప్రస్తుతం బీ.వెల్లెంల శివారు వరకే భూసేకరణ ప్రక్రియ సజావుగా సాగింది. తదుపరి భూ సేకరణలో కొంత అవాంతరాలతో ప్రస్తుతం కాల్వ పనులు నిలిచాయి. ఆ కాల్వకే గండిపెట్టి కొండపాకగూడం ఊర చెరువును నింపుకోవాలని మంత్రి సూచించారు. అయితే ఆ కాల్వకు గండిపెట్టి చెరువుకు నీటిని తరలించాలంటే అదే గ్రామానికి చెందిన మారం సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డిలకు చెందిన పట్టా భూముల్లో కొంత మేర వరద కాల్వ తవ్వాల్సి ఉంది. ఆ ఇద్దరు రైతులు సహకరిస్తేనే తప్ప చెరువులోకి నీరు చేరదు. కానీ గతంలో తమ భూములు వరద నీటితో మునిగిన సమయంలో తోటి రైతులెవరూ సహకరించలేదని ఆ ఇద్దరు రైతులు ఆగ్రహంగా ఉన్నారు. వారితో పాటు మరికొందరు రైతులదీ ఇదే ధోరణి. దీంతో వారం రోజులుగా ఈ అంశంపైనే గ్రామ సోషల్ మీడియాలో చర్చలు జోరుగా సాగుతున్నాయి.

దేవుడు వరమిచ్చినా...



దేవుడు వరమిచ్చినా అనే సామెతగా మా పరిస్థితి తయారైంది. కాల్వకు గండి పెట్టి చెరువును నింపుకోమని మంత్రిగారు అవకాశం ఇస్తే రైతులు సహకరించడం లేదు. ఇటు వర్షాలు లేక, బోర్లలో నీరు పోయక మా పంటలు ఎండిపోతున్నాయి. 7 ఎకరాల్లో వేసిన వరి పొలం నీరు లేక బీటలు వారుతోంది. మా గోస ఎవరికి చెప్పుకోవాలి.

- తిరుగుడు మహలింగం, రైతు

4 ఎకరాల్లో పంట ఎండింది



చెరువులో నీరు లేక, బోర్లు పోయక నా కున్న 4 ఎకరాల్లో ఈ కారు పంట ఎండిపోయింది. ఉదయ సముద్రం రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ ఇంకా పూర్తికాలేదు. బీ.వెల్లెంల రిజర్వాయర్ నుంచి అవురవాణికి వెళ్తున్న కాల్వకు తాత్కాలిక గండిపెట్టడం ద్వారా కొండపాకగూడెం చెరువుకు కృష్ణానీటిని తరలిస్తే పంటలకు సాగునీళ్లందేవి. కానీ వరద కాల్వ తవ్వాల్సిన పట్టా భూమి ఉన్న రైతులు సహకరించడం లేదు.

- తిరుగుడు యాదయ్య రైతు

మా భూమిలో వరద కాల్వను తవ్వనివ్వం



వరద కాల్వ కోసం మా భూమిని నష్టపరుచుకోలేం. చెరువులోకి వరద కాల్వను తవ్వితే నీటి కోతతో మా భూమిలో పంటలను నష్టపోతాం. గతంలో భారీ వాన నీటికి మా భూమి వరదలో మునిగితే ఎవరూ సహకరించలేదు. ఎట్టి పరిస్థితుల్లో మా భూమిలో నుంచి వరద కాల్వను తవ్వనివ్వం. అయినా 13 ఎకరాలు ఉండాల్సిన చెరువు విస్తీర్ణం ఇప్పుడు 5 ఎకరాలే ఉంది. మిగతా భూమి అంతా ఆక్రమణకు గురైంది. దీనిపై అధికారులు సర్వే చేసి విచారణ జరపాలి.

- మారం సత్తిరెడ్డి, రైతు

శ్రీశైలం సొరంగంలో జరిగిన ఘటనపై సీపీఎం తీవ్ర దిగ్భ్రాంతి

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 22: శ్రీశైలం సొరంగమార్గం రిటైన్ వాల్ వద్ద జరిగిన సంఘటనపై సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం సొరంగమార్గం వద్ద రిటైన్ వాల్ ఒక్కసారిగా కుప్ప కూలిపోవడం వల్ల జరిగిన సంఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించే ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో కొంతమంది గాయాలతో బయటపడ్డారని, ఇంకా బయటపడకుండా గల్లంతైన వారిని వెతికేందుకు ప్రభుత్వం ప్రమాదస్థలంలో స హాయక చర్యలు యుద్ధప్రాతిపదికన చర్యలు ముమ్మరం చేయాలని కోరారు.

టన్నెల్ ప్రమాదం బాధాకరం

● సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ సొరంగంలో జరిగిన ప్రమాదంపై సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి శనివారం ఒక ప్రకటనలో వ్యక్తం చేశారు. శ్రీశైలం నుంచి దేవరకొండ వైపు వెళ్లే టన్నెల్ 14 కిలోమీటర్ ఇన్లెట్ దోమలపెంట వద్ద ఉదయం జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే కాపాడాలన్నారు. అదేవిధంగా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వెంటనే వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

గాయపడిన యువకుడికి పరామర్శ

మర్రిగూడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వట్టిపల్లి గ్రామసర్పంచ్ శ్రీరాములు కుమారుడైన పవన్‌ను బీఎన్‌రెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పవన్‌ను పరామర్శించారు. పవన్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులంతా ఏకం కావాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాశయ్యగౌడ్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై బీసీ అభ్యర్థి అయిన పూల రవీందర్‌ను గెలిపించుకోవాలని బీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్యగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడమే కాకుండా ఓ మారు ఎమ్మెల్సీగా గెలిపొంది ఉపాధ్యాయ, అధ్యాపకుల అనేక సమస్యల పరిష్కారానికి రవీందర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారని పేర్కొన్నారు. సమావేశంలో విశ్రాంతి ఉద్యోగుల సం ఘం గౌరవాధ్యక్షుడు దొమ్మాటి అంజయ్య, కోశాధికారి శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి కేశబోయిన శంకర్, నాయకులు నాగిళ్ల దామోదర్, జెర్రిపోతుల శంకర్, నకిరేకంటి లాలయ్యగౌడ్, అంజయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, బొడ్రాయి వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న చైత్ర ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణగౌడ్

శాలిగౌరారం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్ గ్రామంలో శ్రీలక్ష్మీ గణపతి సహిత పార్వతీ సమేత, హరహర మహాదేవ, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ధ్వజస్తంభ, బొడ్రాయి వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగా యి. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్, జ్యోతి దంపతులు, యంగలి రాంబాబు, నాగరాణి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శీలం సుదర్శన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీమా చేసుకొని ధీమాగా ఉండాలి

శాలిగౌరారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతీ ఒక్కరూ బీమా చేసుకొని ధీమాగా ఉండాలని ధాన్ ఫౌండేషన్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో ఆర్‌బీఐ ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు బీమాపై నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ బ్యాంకు ఖాతా లేని వారు ఉచితంగా ఖాతా తీసుకొని బీమా చేసుకొని ధీమాగా ఉండాలన్నారు. బ్యాంకు సేవలు, ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మిత్ర వేముల ఆంజనేయులు, సీఎఫ్ఎల్ అసోసియేట్ పలస భూపాల్, వీబీకే వేముల శైలజ, మాచర్ల కృష్ణ, పెరుమాళ్ల వెంకన్న పాల్గొన్నారు.

మరమ్మతు పనులు షురూ...

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు



పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న అధికారులు

మర్రిగూడ, ఫి బ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మిషన్ భ గీరథ మెయిన్ పైపులైన్ లీకేజీతో నీ టి వృథా అవుతోంది ఆంధ్రజ్యోతిలో ప్రకటించిన వార్తకు అధికారులు స్పం దించారు. మండలంలోని వట్టిపల్లి నుంచి బట్లపల్లి గ్రామానికి వెళ్లే దారిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వృథాగా పోతుంది. రెండు నెలలవుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన మిషన్ భగీరథ అధికారులు శనివారం లీకేజీ అవుతున్న పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈ వెంకటేశ్వర్లు గ్రిడ్ అధికారులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా మిషన్ భగీరథ అధికారులు మరమ్మతులు చేయించి నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు.

బీసీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు



విలేకరుల సమావేశంలో మట్లాడుతున్న లక్ష్మీనారాయణ, జానయ్యయాదవ్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన సుందర్‌రాజ్ యాదవ్, పూల రవీందర్‌లకు బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీ నారాయణ, బీసీ సంఘం రాష్ట్ర ఉద్యమ నేత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీసీలందరూ ఏకమైన తరుణంలో బీసీ ఉపాధ్యాయులు మా ఓట్లు మేము వేసుకుంటామనే ఐకృత తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మొదటి, రెండవ ప్రాధాన్యత ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు గెలిస్తే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి వేణుయాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజు, బీసీ యువజన అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, యాదవ విద్యావంతుల జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి సతీష్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పుట్ట వెంకన్న గౌడ్, యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెబోయిన సతీష్, కేశబోయిన మల్లయ్యయాదవ్, వల్లాల సైదులు, జానపాటి శంకర్, శ్రీనివాస్‌యాదవ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



జగదీష్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు తుమ్మల మధుసూదన్‌రెడ్డి, ఎల్‌వీ యాదవ్ అన్నారు. వెంటనే ఆయన తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి తన స్థాయి మరిచి మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే ఆయన బేషరతుగా చంద్రబాబునాయుడికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. త్వరలో చంద్రబాబు నాయకత్వంలో నల్లగొండ గడ్డపై లక్ష మందితో సభను పెట్టడానికి సమాయత్తం అవుతున్నామని, దమ్మంటే అడ్డుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కూరెళ్ల విజయ్‌కుమార్, ఆకునూరి సత్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, తేలు అన్న రవి, బక్కతోళ్ల ఇస్తారి, జంపాల చంద్రశేఖర్, గోగుల నాగరాజు, కొండేటి దయాకర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కట్టంగూరులో టీడీపీ నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ భువనగిరి పార్లమెంటరీ మాజీ ప్రధాన కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సూచించారు. చంద్రబాబు విమర్శించే స్థాయి ఆయనది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు గద్దపాటి వెంకటేశ్వర్లు, బూరుగు తిరుమలేష్, శ్రీపాద నందకుమార్, మాదగోని రామకృష్ణ, చింతల సైదులు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చండూరురూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష 2025 - 26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం ఈ నెల 23వ తేదీన ఆదివారం నిర్వహించనున్నారు. చండూరు మండలం బోడంగిపర్తి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జాల రామకృష్ణ తెలిపారు. ప్రవేశ పరీక్షకు వచ్చే విద్యార్థులు ఉదయం 9.30గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష సమయం ఉదయం 11 గంటల నుంచి మ ధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష జరగనుంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్, పెన్సిల్, రబ్బర్ తీసుకురావాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సన్మార్గంలో పయనిస్తూ దేశానికి దిక్సూచిగా ఉండే యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని చిట్యాల ఎస్ఐ ధర్మ సూచించారు. చిట్యాల పోలీస్ ఆధ్వర్యంలో జాగృతి కళాబృందం మండలం వెలిమినేడులో శనివారం రాత్రి కళాకారుల ప్రదర్శన కార్యక్రమాలతో అవగాహన నిర్వహించారు.

త్రిపుల్‌ఆర్‌లో భాగంగా రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు, రూల్స్ ట్రాఫిక్ నిబంధనలు, రెస్పాన్సిబులిటీస్ బాధ్యతల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. కళాకారుల బృందం ఆటపాట కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాకారులు ఎస్‌కె హుస్సేన్, ఎల్.చంద్రశేఖర్, సత్యం, మురళితో పాటు కళాకారులు, పోలీసులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో రికార్డులు తనిఖీ చేసిన ఆర్డీవో



చెర్వుగట్టు ఆలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం నిర్వహణ రికార్డులను నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకే ఆయన దేవస్థానంలో రికార్డుల తనిఖీ చేసినట్లు సమాచారం. దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు ఇతర కార్యాలయ నిర్వహణ రికార్డులు, రోజువారీగా ఆలయానికి సమకూరే ఆదాయానికి సంబంధించిన రికార్డులను, జాతర ఆదాయ, వ్యయాల రికార్డులను ఈవో సిరికొండ నవీన్‌కుమార్ సమక్షంలో ఆయన పరిశీలించారు. దేవస్థానంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల టెండర్ వ్యవహారాలకు సంబంధించిన రికార్డులను కూడా ఆర్డీవో పరిశీలించినట్లు సమాచారం. ఆర్డీవో ఆకస్మిక తనిఖీ, రికార్డుల పరిశీలనతో దేవస్థానంలో ఈ పరిణామం సిబ్బంది మధ్య చర్చనీయాంశంగా మారింది.

సంఘాలు ఏకమైతేనే కులానికి బలం

● తెలంగాణ బెస్త సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలోని సంఘాలు ఏకమైతేనే కులానికి బలం లభిస్తుందని తెలంగాణ బెస్త సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం 2025 డైరీ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్త కుల బంధువుల చైతన్యం కోసం అనాదిగా గంగపుత్ర సంఘాల పేరుతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ప్రముఖ కవి, గాయకుడు అంబటి వెంకన్న స్థాపించిన తెలంగాణ బెస్త సేవా సంఘం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టి ఉద్యమ సమయంలో కీలకభూమిక పోషించిందన్నారు. బెస్త కుల బంధువుల ఐక్యతను కోరుకుంటూ ఏ సంఘం, ఏ కార్యక్రమం చేపట్టినా, కులానికి బలాన్ని చేకూర్చే ఏ కార్యక్రమానికైనా తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

'టన్నెల్ ప్రమాదానికి సీఎందే బాధ్యత'

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల వేటలో పర్యవేక్షణను గాలికొదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడిపోవడం వల్లే ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. పై కప్పు కూలిన ఈ ఘటనలో లోపల ఎవరైనా చిక్కుకుని ఉంటే వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులు సత్ఫలితాలను సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈవో సైదానాయక్

చిట్యాల రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను చదివి పరీక్షల్లో సత్ఫలితాను సాధించాలని ఎంఈవో పానుగోతు సైదానాయక్ సూచించారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి జడ్పీహెచ్ఎస్‌లో కస్తూరి ఫౌండేషన్ సౌజన్యంతో 10వ తరగతి విద్యార్థులకు అందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. విద్యతోనే అన్ని రంగాల్లో రాణించవచ్చని, విద్యార్థులు ఉన్నతంగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్‌ను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, బాలకృష్ణ, బాలయ్య, నయిముద్దీన్, అష్రాఫ్ అలీ, మాధవి, సాయిబాబా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

కనగల్: విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించాలని ఎంఈవో పద్మ సూచించారు. మండలంలోని చర్లగౌరారం హైస్కూల్‌కు శనివారం కవి రచయిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తాను రచించిన బంతిపూలు, బహుమతి, మొలకలు, మాలిమి వంటి సాహిత్య, బాలకథల పుస్తకాలను ఎంఈవో బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, మల్లేషం, మధుసూదన్, నరేందర్‌రెడ్డి, అన్సారి, నహీదాషమీం, రఘునాదరెడ్డి, నరేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి అంతర్గత మార్కుల పరిశీలన

కట్టంగూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని జడ్పీ హైస్కూల్‌లో శనివారం పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన అంతర్గత మార్కులను ఉపాధ్యాయ బృందం పరిశీలన చేసింది. మార్కులను పరిశీలించిన బృందం వాటిని ఆన్‌లైన్ ద్వారా పరీక్షల బోర్డుకు పంపిస్తామన్నారు. 20 మార్కులకు సంబంధించిన అంతర్గత మార్కుల రికార్డులను ఉపాధ్యాయ బృందం పరిశీలించింది. హెచ్‌ఎం ఎం.సైదులు, విషయ నిపుణులు రమేష్, వెంకటేశం ఆధ్వర్యంలో అన్ని సబ్జెక్టుల మార్కులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంబటి అంజయ్యలతో పాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

కనగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన గ్రామమాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు ఐతగోని వెంకన్నగౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆయన దశదినకర్మ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ.50వేల ఆర్థికసాయాన్ని గ్రామ నాయకులు గోలి జగాల్‌రెడ్డి, గోలి నర్సిరెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. అంతకుముందు వెంకన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సత్తయ్య, సైదులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	156	170
సూర్యాపేట	రూ.90	130	160
నల్లగొండ	రూ.100	150	170

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 , కనిష్ఠం 20.0



విద్యుత్ దీపాల వెలుగులో యాదగిరిగుట్ట ఆలయం

ప్రారంభానికి సిద్ధమైన దివ్య విమాన గోపురం

హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నేడు స్వర్ణ విమానగోపుర మహాకుంభాభిషేకం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో దివ్య స్వర్ణ విమాన గోపురం ప్రతిష్ఠామహోత్సవానికి సర్వం సన్నద్ధమైంది. వేదపండితులు నిర్ణయించిన మేరకు ఆదివారం ఉదయం 11.54గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కారంశ సముహూర్తాన శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ స్వామివారికి గోపురాన్ని అంకితం చేయనున్నారు. మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. స్వామి సన్నిధిలో స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు నాలుగో రోజుకు చేరాయి. ఇదిలా ఉండగా, శనివారం యాగశాలలో హోమాలు, జపాలు, పారాయణాలు వైభవంగా కొనసాగాయి.

•7లో..

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి, భువనగిరి అర్బన్)

ఇంకుడు గుంతల నిర్మాణాలేవీ?



- ప్రజలకు కొరవడిన అవగాహన
- పట్టించుకోని అధికారులు

వర్షాభావానికి తోడు వేసవి ఎండల కారణంగా ఏటా భూగర్భజలాలు పడిపోతున్నాయి. ఫలితంగా వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. పట్టణాల్లో మిషన్ భగీరథ, మునిసిపల్ బోర్లు, బావులతో నల్లాల ద్వారా నీటిని అందిస్తున్నా ప్రజలకు సరిపోవడంలేదు. ఫలితంగా ఇంటికో బోరు ఏర్పాటుచేసుకుంటున్నారు. ఈ బోర్లు సైతం వేసవిలో ఒట్టిపోతున్నాయి. దీంతో వేసవిలో ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు. పట్టణాల్లో ఇల్లు నిర్మించేప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోరు నీటి రీచార్జ్‌కు ఉపయోగపడే ఇంకుడు గుంత నిర్మాణాన్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీనిపై అవగాహన కల్పించేవారు సైతం కరువయ్యారు.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు

•6లో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జీవనరేఖగా నిలవాల్సిన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులకు తరచూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సాంకేతిక సమస్యలు, పునరావాస ఇబ్బందులు, అటవీశాఖ అనుమతులు రాని కారణంతో 2012కే పూర్తవ్వాల్సిన ప్రాజెక్టు ఇప్పటికీ నత్తనడకన సాగుతోంది. 2007లో మొదలైన ఈ సొరంగమార్గం పనులకు తరచూ ఆటంకాలు కలుగుతుండడంతో ఇప్పటివరకు పథకం పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టులో భాగంగా శ్రీశైలం రిజర్వాయర్ సమీపంలో నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమలపెంట ప్రాంతం నుంచి నల్లగొండ జిల్లాలోని చందంపేట మండలంలోని నక్కలగండి ప్రాంతం వరకు 43.930కిలోమీటర్లు సొరంగం (టన్నెల్) తవ్వాల్సి ఉంది. అందు కోసం శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్ 19.500 కిలోమీటర్లకు ఇప్పటివరకు 13.935 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 6.015 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఎస్ఎల్‌బీసీ పనులపై నీలినీడలు



సంఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీ

- 2019 నుంచి ఇటీవలి వరకు నిలిచిన పనులు
- తాజాగా, పనులు ప్రారంభించిన వారంలోనే దుర్ఘటన
- ఈ ఘటనతో పనులు ముందుకు సాగడంపై సందిగ్ధం!

ఇన్‌లెట్ వైపు (శ్రీశైలం రిజర్వాయర్ సమీపం నుంచి) తవ్వే సొరంగం పనులు ముందుకుసాగకుండా 2019 నుంచి ఊట నీరు వచ్చిచేరుతోంది. దీంతోపాటు, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో పనులు ముందుకు సాగలేదు. ఊట నీటిని తోడివేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊట మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయించారు. తాజాగా, ఐదు రోజుల క్రితమే ఈ పనులను మళ్లీ పునరుద్ధరించగా, శనివారం పనులు జరుగుతున్న టన్నెల్ వద్ద సుమారు వందమీటర్లకు పైగా కూలిపోవడంతో పెనుప్రమాదం చోటుచేసుకుంది. ఈ టన్నెల్ పెండింగ్ పనులకు సంబంధించి 14వ కిలోమీటర్ నుంచి 19.500 కిలోమీటర్ వరకు ఉన్న ప్రాంతంలో ఊట నీటిని అదుపుచేయలేకపోవడంతో పాటు, శ్రీశైలం రిజర్వాయర్‌లో నీరు టన్నెల్ కాంటూరు లెవల్స్ కంటే ఎగువన ఉండడంతో పాటు ఇక్కడ గ్రానైట్, రాతిశిలల కంటే మట్టి, సన్న రాళ్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో సొరంగం తవ్వగానే పెళుసుబారి కూలిపోతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతూ వస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రౌంటింగ్ చేస్తున్నప్పటికీ అది కప్పును బలంగా ఉంచలేకపోయిందని అందువల్లే శనివారం దుర్ఘటన జరిగి ఉంటుందని అంచనావేస్తున్నారు. 2019 నుంచి ఈ సమస్య తీవ్రతరం కావడంతో ఇన్‌లెట్ సొరంగం పనులు ముందుకుసాగని పరిస్థితి ఏర్పడింది.

మార్చి నుంచి ఔట్‌లెట్ వైపు పనులు చేపట్టే యోచన

మన్నేవారిపల్లి నుంచి (నీరు విడుదలయ్యే వైపునుంచి) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980 కిలోమీటర్లకు 20.435 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 3.545 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. పూర్తి విదేశీసాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా ఈ పనులు చేపట్టారు. టన్నెల్ తవ్వుతున్న టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)లో మరమ్మతులు వస్తే పరికరాలు, బేరింగుల కోసం సంవత్సరాల తరబడి వేచిచూస్తుండడంతో పనులకు తీవ్రస్థాయిలో ఆటంకం కలుగుతోంది. టీబీఎంలో కీలకమైన బేరింగ్ ఇప్పటికే మూడోసారి మరమ్మతు కారణంగా పనులు నిలిచాయి. ఏడుమీటర్ల వ్యాసంతో, 37 మెట్రిక్ టన్నుల బరువుండే ఈ బేరింగ్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉండగా, ఆరునెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ బేరింగ్ తయారీ కంపెనీ రాబిన్‌సన్ కంపెనీతో చర్చించి, అగ్రిమెంట్ చేయించే నిమిత్తం స్వయంగా అమెరికా వెళ్లారు. ఆ కంపెనీకి వెళ్లి బేరింగ్‌కు, ఇతర పరికరాలకు ఆర్డర్ కోసం అగ్రిమెంట్ చేయించారు. ఈ బేరింగ్...

- మిగతా 7వ పేజీలో...

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): శ్రీశైలం సొరంగమార్గం ఇన్‌లెట్ టన్నెల్ నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ప్రమాద ఘటన విషయం తెలియగానే నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డితోపాటు నీటిపారుదలశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జరిగిన ఘటనను పరిశీలించి సహాయక చర్యల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, ఈ ఘటనపై దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ విచారం వ్యక్తం చేశారు. ఘటనపై నీటిపారుదలశాఖ అధికారులను ఆరాతీశారు.



ఘటనా స్థలిలో పరిస్థితిని సమీక్షిస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఫిర్యాదులపై సత్వరమే విచారణ



'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

ఎస్పీ శరత్‌చంద్రపవార్

డిండి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై సత్వరమే విచారణ నిర్వహించి చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన 'మీట్ యువర్' ఎస్పీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి 100 కిలోమీటర్ల దూరంలో డిండి మండలం ఉండడంతో జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజలు వారి సమస్యలను వివరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకే తానే ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'మీట్ యువర్' ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వచ్చిన 22 దరఖాస్తుల పై విచారణ నిర్వహించి చట్ట ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విచారణ చేసి వారం రోజుల్లో నివేదిక అందించాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించినట్లు తెలిపారు. ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పేవారి మాటలు నమ్మవద్దని అన్నారు. అటువంటివారిపై ఫిర్యాదులు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ మోసాలపై టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదుచేయాలన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ మౌనిక, సీఐ సురేష్, ఎస్ఐ రాజు ఉన్నారు.

హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు ప్రారంభం

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పీ.కే.మల్లేపల్లి గ్రామంలోని హజరత్ అబ్బాస్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన మమ్మద్ చాంద్‌పాష ఆధ్వర్యంలో ఒంటెపై గంధం (సందల్)ను సమర్పించారు. ఈ ఉత్సవాలకు నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, సాగర్, ఏపీ రాష్ట్రం మాచర్ల, గుంటూరు, పిడుగురాళ్ల, దాచేపల్లి, చీరాల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లోని ప్రజలు దర్గా వద్దకు చేరుకొని మొక్కు తీర్చుకున్నారు. ఉర్సుకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉర్సులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్ పాల్గొని దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు, ముస్లింలు అనే తేడా లేకుండా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మతసామస్యానికి ప్రతీకగా హజరత్ అబ్బాస్ దర్గా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ కేవీ.రమేష్‌రాజు, వైస్ చైర్మన్ ఎండి.జానీమియా, కార్యదర్శి తాళ్ల కృష్ణ, జెల్ల అబ్బయ్య, సీహెచ్.కృష్ణ, ఎండి.యూసుఫ్‌పాష, రామదాసు, ఎండి.సయ్యద్‌పాషా, జైపాల్‌నాయక్, గనమోని అశోక్ పాల్గొన్నారు.



పీకే.మల్లేపల్లిలో ఒంటెపై గంధాన్ని తీసుకువస్తున్న ప్రజలు

నేలపట్లలో బర్డ్‌ఫ్లూ కలకలం

- రాష్ట్రంలో మొదటి కేసు నమోదు
- సమీప గ్రామంలో ఐదు వేల కోళ్లు మృతి
- భయంతో ప్రాణం ఉన్న 9వేల కోళ్లను పూడ్చివేసిన రైతు



వివరాలు ప్రధాన సంచికలో..

మహా కుంభమేళాకు వెళ్లి వస్తుండగా

రోడ్డు ప్రమాదం

11 మందికి తీవ్ర గాయాలు ● నిజామాబాద్ జిల్లాలో ఘటన

•7లో..

మూడోసారి సాగర్

అడవిలో మంటలు

● దగ్ధమైన గడ్డి

•6లో..

జాతీయ రహదారిపై

కారు దగ్ధం

•6లో..

వేర్వేరు కారణాలతో

ముగ్గురి బలవన్మరణం

బాలికల సంరక్షణకు కృషి



చింతపల్లిలో కేజీబీవీలో విద్యార్థులకు శానిటరీ, న్యాప్కిన్స్ అందిస్తున్న కృష్ణవేణి

జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి

చింతపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' అనే కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన బాలికలు నెలసరి క్రమంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, సీడీపీవో సక్కుబాయి, ఎంపీడీవో సుజాత, మండల ఆరోగ్య వైద్యాధికారి శ్రీదేవి, విద్యాధికారి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

సీపీఐ మండల కార్యవర్గం కౌన్సిల్ సమావేశం రేపు

డిండి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ డిండి మండల కార్యవర్గం, విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 24వ తేదీన పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్ఆర్.కనకచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కార్యవర్గ సమావేశం అనంతరం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికలపై విశ్లేషణ, పార్టీ బలోపేతం కోసం తీసువాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

దామరచర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి ఫీడర్ పరిధిలో 11 కేవీ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఆదివారం వాడపల్లి ఫీడర్ కింద ఉన్న దామరచర్ల - జాన్‌పహాడ్ రోడ్డు బ్రిడ్జి అవతల ఉన్న ఇండస్ట్రీస్, వాడపల్లి, గణేష్‌పాడు గ్రామాలకు, నర్సాపురం ఫీడర్ కింద ఉన్న రాజగట్టు, నర్సాపురం, శాంతినగర్ గ్రామాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ తెలిపారు.

సైన్స్‌తోనే మనుగడ



వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీస్తున్న సైదిరెడ్డి తదితరులు

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని ప్రముఖ విద్యావేత్త సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రకృతి, మానవ జీవితంతో ముడిపడి ఉన్న సామాన్యశాస్త్రంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. . అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్, ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండో తిరుపతిగా పేరుగాంచిన కోదండపురం గ్రామంలో వెలిసిన పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవం శనివారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి తేరు వరకు పల్లకిలో ఊరేగించారు. అనంతరం స్వామివారు, అమ్మవార్లను రథంపై ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఆలయం నుంచి పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు.



హాలియా: ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం

వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామి వారి రథాన్ని లాగి తన్మయత్వం చెందారు. తేరు ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. వేద పండితుడు శ్రీనివాసచార్యులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గజ్జేల వెంకటేశ్వరరెడ్డి, పాలక మండలి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణాచారి, పోచంరెడ్డి సైదిరెడ్డి, ఇందిర, మహేందర్, నక్క భిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, బాలబోయిన వెంకటయ్య, అర్చకులు పొందూరి శ్రీనివాసచార్యులు, శ్రీరమణచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

హాలియా: హాలియాలోని శ్రీ స్వయంభూ భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం నాలుగో రోజు నంది వెలుగు శ్రీబాలాజీ గురుకుల్, త్రిశతాధిక ప్రతిష్ఠాచార్యుల, రేపల్లె బృందం, సపతి ప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తమ ఇంటి ఆడపడుచుల ద్వారా తీసుకువచ్చిన నీటిని జలాధివాసంలో ఉంచిన స్వామికి పోశారు. అదే విధంగా ద్వారకామయి భజన మండలి, కూకట్‌పల్లి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా సుమారు ఐదు గంటల సమయం ఆలపించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, గౌరవాధ్యక్షులు కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, పారిశ్రామికవేత్త చిట్టిపోలు యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పీఏపల్లి: వేంకటేశ్వరస్వామి రథం ముందు పూజలు చేస్తున్న పండితులు

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశం కోసం నిర్వహిస్తున్న పరీక్షకు సాగర్ బీసీ హాస్టల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈ పాఠశాలలో మొత్తం 239 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్ల పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని ఉదయం 10 నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సామగ్రిని మాత్రమే వెంట తెచ్చుకోవాలని సూచించారు.



పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న సిబ్బంది

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లాపురం గ్రామం శనివారం ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పల్లెలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే బాలునాయక్ హాజరై వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, బోడియానాయక్, తేరా సత్యనారాయణరెడ్డి, హరికృష్ణ, వెంకట్‌రెడ్డి, నారాయణనాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్ 14, 17జిల్లా కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, సమష్టితత్వం పెంపొందుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఫైనల్‌లో అండర్ 14లో స్థానిక శాస్త్ర స్కూల్, అండర్ 17 విభాగంలో చైతన్య స్కూల్ జట్లు గెలుపొందగా రూ. 10వేల నగదు బహుమతి, విన్నర్ కప్‌లను అందజేశారు. బెస్ట్ రైడర్‌గా గౌతం, బెస్ట్ డిపెండర్‌గా లోకేష్‌లకు షీల్డ్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రామకృష్ణ, రుణాల్‌రెడ్డి, రవినాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి నాగునాయక్, రామకృష్ణ, దాసరి బీమేష్, నర్సిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శరత్, ఉపేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ఎదగాలి



దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ రఘుపతి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు వ్యాపారంలో మెళకువలు నేర్చుకొని ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ రఘుపతి అన్నారు. ఎనేబుల్ ఇండియా వారి సహకారంతో ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో దివ్యాంగులకు వ్యాపారంలో పాటించాల్సిన మెళకువల గురించి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శనివారం శిక్షణ పొందిన దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందజేసి ఎస్‌బీఐ సహకారంతో అర్హులకు రుణాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సోషల్ ఆడిట్ టీం సభ్యులు భూషయ్య, విద్యులత, ఎనేబుల్ ఇండియా స్టేట్ మేనేజర్ కొత్త మల్లిఖార్జున్, బ్లూ ఫౌండేషన్ సభ్యుడు నోముల మధుయాదవ్, మేదరి కిరణ్‌కుమార్, ఆర్ఎస్ఈటీఐ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నందికొండలో ఏళ్ల నాటి వృక్షం తొలగింపు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నందికొండ ఆఫీసర్స్ క్లబ్‌లో ఉన్న దశాబ్దాల కాలం నాటి వృక్షం నేలమట్టమైంది. ఓ వైపు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ ప్రభుత్వం అవగాహన కల్పిస్తుంటే ఎందుకు కూల్చారో చెప్పకుండా ఓ అధికారి భారీ వృక్షాన్ని నేలకూల్చడం పర్యావరణ ప్రేమికులను బాధించింది. కాలనీ వాసులకు స్వచ్ఛమైన గాలిని... ఆఫీసర్స్ క్లబ్ నీడనిచ్చే చెట్టును కొట్టివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దశాబ్దాల కాలం నాటి ఈ చెట్టును నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఏఈగా పనిచేస్తున్న నరసింహమూర్తి శనివారం కొట్టివేయిస్తుండటంతో నందికొండ మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ మంద రఘువీర్ ఏఈని ప్రశ్నించాడు. భారీ వృక్షాలను తొలగించాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అటవీ అనుమతి లేకుండా చెట్టును కొట్టివేసిన ఏఈపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ అటవీ శాఖ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు రఘువీర్ తెలిపారు.

సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జీలకర కుంటతండాలో నిర్వహించిన సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సేవాలాల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు స్కైలాబ్‌నాయక్, గిరిజనులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

● పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండలకేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతిని శనివారం బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి, మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన వారిలో సంత్ సేవాలాల్ మహరాజ్ ఒకరని పేర్కొన్నారు. బెల్లం, బియ్యం,పప్పు, నెయ్యిని ఉపయోగించి తయారు చేసిన పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోడియానాయక్, నాయకులు రామచంద్రనాయక్, కేతావత్‌మూనా, నారాయణ, గాసిరాంనాయక్, లచ్చిరాం, పాండునాయక్, చంద్రునాయక్, సీతారాం, భీమానాయక్, లక్ష్మణ్‌నాయక్, దస్రూనాయక్, బాలకృష్ణ, రామునాయక్, శ్రీరామ్, రఘు,రాజా, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి: సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

కృష్ణా జలాలను తరలిస్తున్నా పట్టించుకోరా

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలను తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. హాలియాలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా నాగార్జునసాగర్ డ్యాం మీద సీఆర్‌పీఎఫ్ బలగాలను పెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయాలు జరుగుతున్నాయన్నారు. కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర పునర్విభజన జరిగినప్పుడు ఆంధ్రా ప్రాంతానికి ఎంత, తెలంగాణ ప్రాంతానికి ఎంత అని తాత్కాలిక ఒప్పందం చేశారు. ఆంధ్ర ప్రాంతం వారు కేంద్రప్రభుత్వం సహకారంతో దానిని ఉల్లఘించి కేఆర్ఎంబీని మభ్యపెట్టి నీటిని తీసుకుంటున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాత ప్రభుత్వం అప్పటికప్పుడు లేఖ తయారు చేసి కేఆర్ఎంబికి పంపించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా 11వేల క్యూసెక్కుల నీరు ఆంధ్రా ప్రాంతానికి వెళ్తూనే ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. నీటిపారుదల శాఖ మంత్రి జిల్లాకు చెందిన వ్యక్తి ఉన్నా నీటి కష్టాలు తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సమస్యలపై మాట్లాడే దమ్ము, ధైర్యం కాంగ్రెస్, బీజేపీలకు లేదని ఆయన విమర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నిడమనూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. పిల్లలకు పాఠాలు బోధించారు. సీఎంగా గణేష్, డిప్యూటీ సీఎంగా నవ్య, కలెక్టర్‌గా లిఖిత, ఎమ్మెల్యేగా శంకర్, ప్రిన్సిపాల్‌గా సాయికిరణ్ అనే విద్యార్థులు వ్యవహరించారు. వివిధ పాత్రలతో ప్రతిభ చాటుకున్న విద్యార్థులను పలువురు అభినందించి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కందికట్ల ధన్వంతరిబాబు, డైరెక్టర్ యాదలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిడమనూరు: కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్రమశిక్షణతో విద్య నభ్యసించాలి: ఎంఈవో

మిర్యాలగూడ టౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంఈవో లావూరి బాలునాయక్ అన్నారు. పట్టణంలోని ఈదులగూడ ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. స్వపరిపాలన దినోత్సవం రోజున విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు. తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడం అవగాహన పెంచడమేనని అన్నారు. కాగా విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లాలు, ఉపాధ్యాయులు కొనకంచి వెంకటేశ్వర్లు, కందుల శ్రీదేవి, నిర్మల, లక్ష్మి, మహిత, రత్నకుమారి, జ్యోతి, బిక్షం, సురేందర్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతే నా పనితీరుకు గీటురాయి

● ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నిజాయతీ, నిబద్ధతే తన పనితీరుకు గీటురాయి అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం పలు పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరేళ్లుగా టీచర్ల సమస్యలే ఏకైక ఎజెండాగా పనిచేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ నిధుల నుంచి 60శాతం నిధులు పాఠశాలల అభివృద్ధికే ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో నిలబడి గెలిచిన వెంటనే పార్టీలకు మారారని అన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడి 2021 30 శాతం పీఆర్సీ సాధించడంలో కృషి చేశానని అన్నారు. 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు, 30 వేల మందికి బదిలీలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 30 శాతం వేతనాల పెంపునకు కృషి చేసినట్లు చెప్పారు. సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ 2021 జూలైలో 4 రోజుల పాటు నల్లగొండ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసినట్లు వెల్లడించారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని అన్నారు. గురుకులాల సమయ మార్పిడి, హెల్త్‌కార్డులు, 010 ద్వారా జీతాల చెల్లింపుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసచారి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిన వెంకన్న, వేదశ్రీ, ప్రభాకర్, బాలరాజు, నాగేష్‌నాయక్, జయరాజు, సాజీద్ అలీ, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. అయూబ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్నెస్పీ అతిథిగృహంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, పింఛన్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎండీ. ఖాజాహమీదుద్దీన్, సంఘం నాయకులు వెంకన్న, మనోజ్, సైదులు, మహేష్, నాజీమ్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి



వేములపల్లి కార్యక్రమంలోమాట్లాడుతున్న సీడీపీవో చంద్రకళ

వేములపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి అభివృద్ధి సాధించాలని సీడీపీవో చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికల హక్కులను సద్వినియోగం చేసుకుంటూ బాల్యవివాహాల నివారణకు ప్రతీ విద్యార్థిని కృషి చేయాలన్నారు. విద్యార్థినులు సమతుల పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు నయామున్నీసా బేగం, షబానా, చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిని, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు

దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

దేవరకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేవాలయానికి నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేయాలని శివాజీ యూత్ సంఘం అధ్యక్షుడు నేతాళ్ల వెంకటేష్ యాదవ్, గంప ప్రవీన్‌కుమార్‌శర్మ డిమాండ్ చేశారు. శనివారం శ్రీరామసేన యూత్, భజరంగ్‌దళ్, శివాజీయూత్ సభ్యులు దేవరకొండ పట్టణ శివారు గాజీనగర్ రోడ్డులోని గుట్టపై ఉన్న పురాతన సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని వారు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గోకర్ల శ్రీను, రామకృష్ణ, సుమన్, విజయ్, జైకృష్ణ, రామసేన, శివాజీయూత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని పలువురు టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడుపై మాజీమంత్రి జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శనివారం తెలుగుతమ్ముళ్లు భగ్గుమన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజాదరణ తగ్గినప్పుడు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడం, నీళ్ల వివాదాలను తెరపైకి తేవడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటేనని విమర్శించారు. ప్రజానేత చంద్రబాబు పేరును రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సిగ్గు చేటన్నారు. క్రమశిక్షణ గల పార్టీకి జాతీయ అధ్యక్షులైన చంద్రబాబును విమర్శించే స్థాయి జగదీష్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు.

మిర్యాలగూడ బస్టాండ్ ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఎదుట మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిలుకల వెంకన్న, మైనార్టీ నాయకులు నసీరుద్దీన్‌బాబా, ఏచూరి అనంతరాములు, రావిరాల నాగేందర్, ఉప్పలపాటి గోపాలకృష్ణ, కాంతాచారి, గణేష్, నవీన్, గర్దాసు ప్రభాకర్ శోభన్, శంకర్‌రావు, రామారావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

● మాడ్గులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ రసూల్, మండల ప్రధాన కార్యదర్శి కట్టా అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లిలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు జడ రాములుయాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు తలమానికంగా ఉన్న హైదరాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన చంద్రబాబును తెలంగాణలోకి రావద్దని అనడం సరికాదన్నారు.